

టిఫిన్ చేస్తున్న రావిర్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

## బెంచి వద్దకే 'బ్రేక్‌ఫాస్ట్'..


# ఆకలికి సెలవిక..



- మానవీయ కోణంలో ఆలోచించిన సీఎం.. ఈ పథకానికి శ్రీకారం చుట్టారు
- బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- సీఎం కేసీఆర్ అమలు చేసే ప్రతి పథకం సూపర్ హిట్ : మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- 'రావిర్యాల' ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'సీఎం అల్పాహారం' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన మంత్రులు
- విద్యార్థులతో కలిసి టిఫిన్ చేసిన మంత్రులు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు



బెలూన్స్ వదులుతున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి




మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్

రంగారెడ్డి, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : సీఎం అల్పాహారం కార్యక్రమం విద్యార్థులకు గొప్ప వరమని, ఈ పథకం విద్యా వ్యవస్థలో సమూల మార్పు తెస్తుందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న 'సీఎం అల్పాహారం' పథకాన్ని శుక్రవారం మంత్రి హరీశ్ రావు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డితో కలిసి రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ మున్సిపాలిటీలోని రావిర్యాల ఉన్నత పాఠశాల వేదికగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఏ పథకాన్ని అమలు చేసినా ప్రజా కోణంలో ఆలోచిస్తారని, అందుకే అన్ని పథకాలు విజయవంతం కావడంతోపాటు సామాజిక మార్పునకు కారణం అవుతున్నాయన్నారు. కల్యాణ లక్ష్మి పథకంలో ఇచ్చే రూ.లక్ష సాయంతో బాల్య వివాహాలు తగ్గాయన్నారు. కేసీఆర్ కిట్ వల్ల వంద శాతం ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీలు జరుగుతున్నాయన్నారు. మిషన్ భగీరథ పథకంతో సురక్షిత తాగునీటి సరఫరా వల్ల సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పట్టాయన్నారు. కేసీఆర్ అల్పాహారం పథకం విద్యార్థుల కడుపు నింపే కార్యక్రమం మాత్రమే కాదని, డ్రాప్‌ఔట్స్ తగ్గించి విద్యార్థులు బడి బాట పట్టించి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పు తెచ్చే పథకమని పేర్కొన్నారు. బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, వెయ్యి రెసిడెన్షియల్ స్కూల్స్ ఉన్న ఏకైక రాష్ట్రం కూడా తెలంగాణేనని అన్నారు. దసరా తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ పథకం అమలులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీలు రంజిత్ రెడ్డి, పాటిల్, జడ్పీ చైర్‌పర్సన్ అనితాహరినాథ్ రెడ్డి, ఎమ్మెల్సీలు శంబీపూర్ రాజు, దయానంద్ గుప్తా, రఘోత్తమ్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు వెంకటరమణరెడ్డి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ హనుమంత రావు, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ సెక్రటరీ వాకిటి కరుణ, పాఠశాల విద్య డైరెక్టర్ దేవసేన, కలెక్టర్ హరీశ్, డీఈవో సుశీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.





టిఫిన్ చేస్తున్న విద్యార్థినులు



రావిర్యాలలో జ్యోతిని వెలిగిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి

## విద్యార్థులతో కలిసి టిఫిన్ చేసిన మంత్రులు..

విర్యాల ఉన్నత పాఠశాలలో బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభోత్సవానికి పాఠశాల విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బ్రేక్ ఫాస్ట్ మొదటి రోజు మెనూలో ఇడ్లీ సాంబారు, పూరీ, ఆలూకుర్మాలను అందించారు. విద్యార్థుల పక్కనే కూర్చుని వారితో కలిసి మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు టిఫిన్ తిన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టిఫిన్‌ను తినిపించారు. కార్పొరేట్ స్థాయిలో బోధన అందించడంతోపాటు మూడుసార్లు విద్యార్థులకు రాగి జావ, బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం సదుపాయాన్ని కల్పించడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.



సీఎంకేసీఆర్ చిత్రంతో ఉన్న బెలూన్స్‌ను ఎగురవేస్తున్న విద్యార్థులు

## ఏ పథకమైనా సూపర్ హిట్

### రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి



సీఎం కేసీఆర్ మానవీయతతో అమలు చేసే ప్రతీ పథకం సూపర్ హిట్ అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం రావిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని మంత్రి హరీశ్‌రావుతో కలిసి ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 27వేల పాఠశాలల్లోని 23లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. చాలామంది విద్యార్థులు పస్తులతోనే పాఠశాలలకు వస్తున్నారని, ఇటువంటి వారిని దృష్టిలో పెట్టుకుని సీఎం కేసీఆర్ బ్రేక్ ఫాస్ట్ పథకానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావతోపాటు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ఖర్చుకు వెనుకాడకుండా మన ఊరు-మన బడి కార్యక్రమంలో రూ.7వేల కోట్లు ఖర్చుచేసి చేపట్టిన పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. ఆంగ్ల మాధ్యమంపై విద్యార్థుల తల్లిదండ్రులకు ఉన్న తపనను దృష్టిలో పెట్టుకుని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా కార్పొరేట్ స్థాయిలో అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. అల్పాహారం నాణ్యతను పరిశీలించేందుకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు పాఠశాలలను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.





విద్యార్థులతో కలిసి టిఫిన్ చేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, కలెక్టర్ నారాయణరెడ్డి

# రోజుకో వెరైటీ టిఫిన్

### వికారాబాద్ జిల్లాలోని పలు పాఠశాలల్లో సీఎం అల్పాహారం పథకం ప్రారంభం

- జిల్లాలో నియోజకవర్గానికి ఒక పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభం
- వికారాబాద్‌లోని శివారెడ్డిపేట్ జడ్పీహెచ్‌ఎస్‌లో, సీఎం అల్పాహార పథకాన్ని ప్రారంభించిన మంత్రి మహేందర్‌రెడ్డి
- విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకున్న మంత్రి, కలెక్టర్, వికారాబాద్ ఎమ్మెల్యే
- ఆయా నియోజకవర్గాల్లో అల్పాహారం పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు
- జిల్లాలోని 4 పాఠశాలల్లో 602 మంది విద్యార్థులకు అందించిన బ్రేక్‌ఫాస్ట్
- విద్యాహబ్‌గా తెలంగాణ అవతరిస్తుందన్న మంత్రి మహేందర్‌రెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ముఖ్యమంత్రి మానవీయ కోణంతో అమల్లోకి తీసుకొచ్చిన పేద పిల్లలకు వరంలాంటి సీఎం అల్పాహార పథకం ప్రారంభమైంది. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని ఒక్కో పాఠశాలలో సీఎం అల్పాహార పథకాన్ని ప్రారంభించారు. వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్‌ఎస్ శివారెడ్డిపేట్ ప్రాథమిక పాఠశాలలో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌తో కలిసి రాష్ట్ర గనులు, భూగర్భవనరుల శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించగా, తాండూరు నియోజకవర్గంలోని తాండూరు మండలం గౌతాపూర్ పాఠశాలలో ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, పరిగి నియోజకవర్గంలోని పూడూరు మండలం మన్నెగూడ ప్రాథమిక పాఠశాలలో ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిలు ప్రారంభించారు. కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి కొడంగల్ పట్టణంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో స్థానిక ప్రజాప్రతినిధులు పథకాన్ని ప్రారంభించారు. వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డిపేట్ ప్రాథమిక పాఠశాలలో సీఎం అల్పాహారం పథకాన్ని ప్రారంభించిన అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి మహేందర్ రెడ్డి, కలెక్టర్ నారాయణ రెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే ఆనంద్ బ్రేక్ ఫాస్ట్ చేశారు. శుక్రవారం జిల్లాలోని నాలుగు పాఠశాలల్లో 602 మందికి అల్పాహారం అందించారు. దశలవారీగా మిగతా ప్రభుత్వ పాఠశాలల్లోని ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమల్లోకి తీసుకురానున్నారు. ఒక్కో రోజు ఒక్కో వెరైటీ అల్పాహారాన్ని ఉదయం 8.45 గంటల నుంచి విద్యార్థులకు అందించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ మానవీయ కోణంతో తీసుకువచ్చిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా 27,147 పాఠశాలల్లోని 23 లక్షల మంది విద్యార్థులకు, జిల్లాలోని 1051 స్కూళ్లలోని 92 వేల మంది విద్యార్థులకు సీఎం అల్పాహారం అందనుందన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల స్వరూపం పూర్తిగా మారిపోయి విద్యాహబ్‌గా తెలంగాణ అవతరిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

### 'అల్పాహారం' అద్భుతం

వికారాబాద్, అక్టోబర్ 6 : సీఎం అల్పాహారం పథకం అద్భుతంగా ఉందని మంత్రి మహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని శివారెడ్డిపేట పాఠశాలలో సీఎం అల్పాహారం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆనంద్, కలెక్టర్ సి.నారాయణరెడ్డిలతో కలిసి మంత్రి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్‌పటేల్, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, ఎంపీపీ చంద్రకళ, ఎంఈవో బాబుసింగ్, కౌన్సిలర్ నస్రిన్ భేగం, ప్రవళిక, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



టిఫిన్ చేస్తున్న విద్యార్థినులు